# వచ్చే నెలలో గుట్టకు సీఎం రేవంత్ రెడ్డి!


- దివ్యవిమాన గోపురం స్వర్ణతాపడం, వేద పాఠశాల నిర్మాణానికి శ్రీకారం

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : వచ్చే నెలలో సీఎం రేవంత్ రెడ్డి యాదగిరిగుట్టకు రానునట్లు తెలిసింది. అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో సందర్శించనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి రెండు, మూడ్రోజుల్లో షెడ్యూల్ ఖరారు కానున్నట్లు తెలుస్తున్నది. సీఎం గుట్ట పర్యటనలో భాగంగా స్వామివారిని దర్శించుంకుని ఆలయ దివ్యవిమాన గోపురం స్వర్ణతాపడం పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఇక్కడ కాపర్ పనులు పూర్తయ్యాయి. అధికారులతో సమీక్ష నిర్వహించే అవకాశం కూడా ఉంది. రాయగిరిలో వేద పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. రాయగిరి చెరువు కట్ట వద్ద ఉన్న శిల్పారామాన్ని ప్రారంభించనున్నట్లు తెలిసింది. జిల్లాలోని పలు ఆలయాలను కూడా దర్శించుకునే అవకాశం ఉందని సమాచారం.

# సంచలనంగా జంక్షన్ టెన్షన్ కథనం

**ప్రభుత్వ కుట్రలు బహిర్గతం చేశారని నమస్తే తెలంగాణకు ప్రశంసలు**

- తమ గోడును కండ్లకు కట్టారంటున్న బాధితులు
- ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల వాట్సాప్ గ్రూపుల్లో షేరింగ్స్
- స్టేటస్, డీపీలుగా కథనం
- గతంలో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు మరోసారి తెరపైకి
- సోషల్ మీడియాలో అలైన్‌మెంట్ మారుస్తానని పలు సందర్భాల్లో చెప్పిన వీడియోలు వైరల్
- వాళ్లకు పదవులు రాగానే ట్రిపుల్ ఆర్ బాధితులు కనిపిస్తలేరా? అంటూ ప్రశ్నలు
- జంక్షన్ పరిధి పెంచే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్




చౌటుప్పల్‌లో ఏర్పాటు చేయనున్న ట్రిపుల్ ఆర్ జంక్షన్ మ్యాప్

*చౌటుప్పల్‌లో ట్రిపుల్ ఆర్ భూమాయం... జంక్షన్... టెన్షన్ పేరుతో నమస్తే తెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురించిన ప్రత్యేక కథనం ట్రిపుల్ ఆర్ ప్రాంతాల్లో సంచలనం సృష్టించింది. ఉత్తర భాగం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌తోపాటు భూసేకరణకు అడుగులు పడుతుండగా... దక్షిణ భాగంతో మాత్రం రాష్ట్ర ప్రభుత్వ ఆటలాడుతుంది. కేంద్ర ప్రభుత్వాన్ని కాదని రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా అలైన్‌మెంట్‌తోపాటు నిర్మించాలనుకుంటున్నట్లు జరుగుతున్న పరిణామాలు చెప్తున్నాయి. అందువల్లే ఇష్టరాజ్యంగా అలైన్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుని మార్పులు చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్తగా అనేక ప్రాంతాల్లో ట్రిపుల్‌ఆర్ అలజడులు మొదలయ్యాయి.*

*ఇలాగే చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో గతంలో 78 ఎకరాల్లో జంక్షన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. కానీ రెండు నెలల కిందట ప్రభుత్వం ఉన్నట్లుండి 181 ఎకరాలకు జంక్షన్‌ను విస్తరణకు నిర్ణయించింది. జంక్షన్ విస్తరణ ఎందుకోసమని చెప్పే వారూ లేరు. అధికారులు నోరు మెదపరు. జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు తమకేమీ తెలియదని అంటుండడంతో స్థానికులకు కంటి మీద కునుకు కరువైంది. ఈ నేపథ్యంలో బాధితుల ఆవేదన, వారి ఆందోళనను కండ్లకు కట్టినట్లు వివరిస్తూ జంక్షన్ విస్తరణలో ప్రభుత్వ కోణాన్ని ఆవిష్కరిస్తూ, జిల్లా మంత్రి, ఎమ్మెల్యే తీరును ఎండగడుతూ సోమవారం నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనం ప్రచురించింది. ఆ కథనం స్థానికంగా సంచలనంగా మారింది.*

*– నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ)/చౌటుప్పల్*

సోమవారం పొద్దుగాల నుంచే నమస్తే తెలంగాణ కథనం స్థానికంగా సోషల్ మీడియా గ్రూప్స్‌లో వైరల్ అయ్యింది. జంక్షన్ విస్తరణలో భూములు, ఇండ్లు, ప్లాట్లు కోల్పోతున్న బాధితులు కథనాన్ని ఓన్ చేసుకుని తమ పరిధిలోని గ్రూపుల్లో షేర్ చేశారు. ట్రిపుల్ ఆర్ భాధితుల పేరుతో కొనసాగుతున్న పలు వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా షేర్ చేశారు. భాధితులంతా దీన్ని స్టేటస్‌లు, డీపీలుగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. దాంతో ట్రిపుల్ ఆర్ ఏరియాల్లో రోజంతా కథనం కలకలం రేపింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లోనూ షేర్ చేశారు. తమ గోడు ప్రభుత్వం వద్దకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు కూడా చేరేలా షేర్ చేశారు.

జంక్షన్‌ను పాత పద్ధతిలోనే నిర్మించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో 78 ఎకరాలే సరిపోగా ఇపుడు ఎందుకు ఒకే సారి 181 ఎకరాలకు పెరుగుతుందని నిలదీస్తునారు. ఎవరి కోసం తమ భూములు, ఇండ్లు, ప్లాట్లు గుంజుకోవాలని చూస్తున్నారో చెప్పాలని కోరుతున్నారు. తెలంగాణ బిడ్డల ఆస్తులను ఫణంగా పెడుతూ ఇతర ప్రాంత ప్రయాణికుల విందు, వినోదల కోసం జంక్షన్ విస్తరణ చేయడాన్ని అడ్డుకుంటామని చెప్తున్నారు. అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధమని నిర్వాసితుల పక్షాన ట్రిపుల్ బాధిత సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, చింతల దామోదర్‌రెడ్డి స్పష్టం చేశారు. నమస్తే తెలంగాణ కథనంతోనైనా ప్రభుత్వం, పాలకులు బాధితుల గోడు అర్థం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### తెరపైకి మంత్రి కోమటిరెడ్డి వీడియోలు..

ట్రిపుల్ ఆర్ భాధితులతో గతంలో ఎంపీగా ఉన్నప్పుడు, ఇప్పుడు మంత్రి అయ్యాక కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యవహార శైలిపై నమస్తే తెలంగాణ కథనంలో పేర్కొన్న అంశాలపై కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో రాయగిరి రైతుల పక్షాన మాట్లాడిన మాటలను మరోసారి వైరల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, కోమటిరెడ్డి మంత్రి అయ్యాక కూడా చాలా సార్లు కలిసే ప్రయత్నం చేశారు. అపుడు అలైన్ మెంట్ మార్చుతామని, బాధితులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పిన మాటలు సోషల్ మీడియా వేదికగా గుర్తు చేశారు. మంత్రి అయ్యాక కూడా ప్రారంభంలో చాలాసార్లు 'ఆ డిపార్ట్‌మెంట్ నాదే... రోడ్ నాదే... అలైన్మెంట్ మార్చేద్దాం' అని చెప్తున్న వీడియోను వైరల్ చేశారు. ఇపుడేమో రాయగిరి రైతులకు టైమ్ ఇవ్వకుండా మొహం చాటేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల నుంచి చౌటుప్పల్ జంక్షన్ బాధితులు పలుమార్లు కలిస్తే నాకేం తెల్వదు... సీఎం రేవంత్‌రెడ్డే చూస్తున్నడు.. ఆయన్నే అడుగండి అంటూ తప్పించుకుంటూన్నాడని భాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొద్దున లేస్తే రేవంత్ రెడ్డికి చాలా దగ్గర అని చెప్పుకొనే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి... ఎందుకు తమ జంక్షన్ పరిధిని పెంచకుండా అడ్డుకోరని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. అప్పుడు అంటే ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ కేంద్రం చేతిలో ఉండగా దక్షిణ భాగం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో అలైన్‌మెంట్ ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చి ఎందుకు పరిధి పెంచకుండా మంత్రి అడ్డుకోడని ప్రశ్నిస్తునారు. రేవంత్ రెడ్డి ఇచ్చే కాంట్రాక్టుల కోసం ట్రిపుల్ ఆర్‌పై మాట్లాడుతలేరేమో అని ట్రిపుల్ ఆర్ నిర్వసితుల వాట్సాప్ గ్రూపుల్లో భాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ తలుచుకుంటే జంక్షన్ పరిధి పెంపు, అలైన్‌మెంట్ మార్పు ఆగదా అని ప్రశ్నిస్తున్నారు.

### న్యాయ పోరాటానికి సన్నద్ధం

ట్రిపుల్ ఆర్ చౌటుప్పల్ జంక్షన్ బాధితులు న్యాయపోరాటానికి కూడా సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఒక వైపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వేదికలపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు తమ గోడును వెళ్లబుచ్చుతూనే మరోవైపు న్యాయ పరంగా జంక్షన్ పరిది పెంచదాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారు. ట్రిపుల్ ఆర్‌లో ఎక్కడా లేని విధంగా చౌటుప్పల్ జంక్షన్‌నే ఎందుకు రెండున్నర రెట్లు పెంచి విస్తరిస్తున్నారని ప్రశ్నించునున్నట్లు తెలిపారు. ట్రిపుల్ ఆర్‌కు తాము వ్యతిరేకం కాదంటూనే జంక్షన్ పరిధి పాత పద్ధతిలోనే ఉండేలా చూడాలని కోరుతున్నారు. ఇక ఈ జంక్షన్ వళ్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ కూడా రెండుగా చిలిపోతుందని, అభివృద్ధి కూడా కుంటుపడుతుందని బాధితులతోపాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మూడుసార్లు భూములు తీసుకున్నరు



ఇప్పటికే మూడుసార్లు భూములు తీసుకున్నరు. అయినా సప్పుడు చేయలేదు. మళ్లీ ఇప్పుడు భూమి ఇవ్వమంటుండ్రు. మేమెట్ల బతుకాలి. కాయకష్టం చేసుకుని చిన్నతనం నుంచి భూమిని నమ్ముకొని బతికినం. ప్రాణం పోయినా భూమి ఇచ్చేది లేదు. ఉన్న భూమిపోతే రోడ్డు మీద పడాల్సిందే. చూసే దిక్కు కూడా ఉండడు.

–జాల యాదయ్యయాదవ్, రైతు, చౌటుప్పల్

### పాలకులు పట్టించుకోవడం లేదు



ట్రిపుల్ బాధిత రైతులకు న్యాయం చేసే విషయంలో కాంగ్రెస్ పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్ని సార్లు వెళ్లినా రైతుల సమస్యను పైకి తీసుకెళ్తామని చెప్తుండ్రు. లేదా బహిరంగ ధర ఇప్పిస్తాం అన్నరు. ఇప్పుడు ఎవరూ సప్పుడు చేయడం లేదు. ఇక్కడ జంకన్ వస్తే చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండుగా చీలి అభివృద్ధి కూడా కుంటుపడుతుంది. ఈ ప్రాంతం అవతలివైపునకు అలైన్‌మెంట్‌ను మార్చాలి.

–గుండెబోయిన వేణుయాదవ్, రైతు, తంగడపల్లి

### రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్నప్పుడు ఎందుకు మార్చరు



దక్షిణ భాగం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని అంటున్నరు. మాది దక్షిణ భాగమే కాదా.. జంక్షన్ మార్చే అవకాశం ఉంటుందిగా. ఎందుకు ఇక్కడి రైతులను పట్టించుకోరు. మా తరపున అడిగే పెద్దలు ఎవరూ లేరా. రైతులను చిన్నచూపు చూపడం మానుకోవాలి.

–జాల జంగయ్య యాదవ్, రైతు, తంగడపల్లి

### మా పిల్లల భవిష్యత్ ఏంది?



కొన్నేండ్ల నుంచి పరిశ్రమల కాలుష్యం మూలంగా పంటలు పండడం లేదు. ఇప్పటికే ఎంతో ఆర్థికంగా నష్టపోయాం. అయినా భూమి ఉందన్న ధీమాతో కష్టం చేసుకుని బతుకువెళ్లదీస్తున్నం. ఇప్పుడు రింగు రోడ్డు అని భూమి గుంజుకుంటే ఎట్లా? ఉన్నా భూమి పోతే మా పిల్లల భవిష్యత్ ఏంది?

–జాల అంజయ్య యాదవ్, రైతు, చౌటుప్పల్

# పాడి రైతుల పరేషాన్

## విజయ డెయిరీ పాల బకాయిలు పెండింగ్

- రెండు నెలలుగా నిలిచిపోయిన నాలుగు బిల్లులు
- జిల్లాలో రూ.కోటికిపైగా పాల ఉత్పత్తిదారులకు బాకీ
- దాణాకు డబ్బులు లేక రైతుల అవస్థలు
- ప్రైవేట్‌లో మిత్తికి అప్పులు చేస్తున్న దుస్థితి
- లోన్ కిస్తీలు కట్టకపోవడంతో బ్యాంకర్ల ఒత్తిడి
- బిల్లులు చెల్లించాలని పాల ఉత్పత్తిదారుల డిమాండ్




*కాంగ్రెస్ సర్కారులో పాడి రైతులు పరేషాన్ అవుతున్నారు. విజయ డెయిరీ కర్షకులకు పాల బిల్లులు చెల్లించడం లేదు. నెలల తరబడి బకాయిలు పేరుకుపోయాయి. జిల్లాలో నాలుగు బిల్లులకు సంబంధించి రూ.కోటికిపైగా పెండింగ్‌లో మూలుగుతున్నాయి. దాంతో రైతులు ఆర్థికంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. పశుపోషణ భారంగా మారుతున్నది. ఈఎంఐలు కట్టకపోవడంతో బ్యాంకుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. డబ్బు లేకపోవడంతో బయట మిత్తికి తెచ్చి చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది.*

*– యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ)*

పాలు, పాల ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎప్పుడూ మంచి డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో అధిక శాతం మంది పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 223 పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. 2,500 మంది కర్షకులు పాల కేంద్రాలకు పాలను సరఫరా చేస్తుంటారు. రైతుల నుంచి రోజుకు 16 వేల లీటర్ల ఆవు, గేదె పాలను విజయ డెయిరీకి విక్రయిస్తుంటారు. పాల నాణ్యతను బట్టి లీటరుకు కనిష్టంగా రూ.39, గరిష్టంగా రూ.75 చెల్లిస్తున్నారు. తద్వారా రైతులు ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

### రెండు నెలలుగా బిల్లులు బంద్..

సాధారణంగా విజయ డెయిరీలో పాలు పోసిన రైతులకు ప్రతి 15 రోజులకోసారి బిల్లులు చెల్లిస్తారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పటికప్పుడు బకాయిలు క్లియర్ అయ్యేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. జిల్లాలో రెండు నెలలుగా రైతులకు బిల్లులు చెల్లించడం లేదు. నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు రూ.కోటికి పైగా పాల ఉత్పత్తిదారులకు బకాయిలు ఉన్నాయి. పాల ఉత్పత్తిని బట్టి ఒక్కో రైతుకు నెలకు సగటును రూ.20 వేల నుంచి 50 వేల వరకు కూడా చెల్లించాల్సి ఉంటుంది. రోజు వారీ పాల కంటే అధికంగా సేకరించడంతో రొటేషన్ ఆగిపోతున్నదని, ఉత్పత్తుల అమ్మకాలు సరిగ్గా జరగడం లేదని, ఫలితంగా బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతున్నదని అధికారులు చెబుతున్నారు. బడ్జెట్ లేకపోవడం కూడా ఓ కారణంగా పేర్కొంటున్నారు.

### పశు పోషణకు అవస్థలు..

ఇప్పటికే రైతులకు రైతు బంధు రాకపోవడం, పాల బిల్లులు ఆలస్యం కావడంతో దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. బిల్లుల పెండింగ్‌తో పాడి రైతులకు పశు పోషణ భారంగా మారింది. హోలిస్టిన్ ఫ్రీజియన్, జెర్సీ ఆవులకు ఖర్చు అధికంగా ఉంటుంది. ఉత్పత్తిలో వచ్చే ఆదాయంలో సగం వరకు పోషణకే వెళ్తుంది. పల్లి చెక్క, పత్తి చెక్క, తవుడు, మక్క పిండి, కాల్షియం అందించాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు పాల బిల్లులు రాకపోవడంతో దాణాకు తిప్పలు తప్పడం లేదు. అంతేగాక పశువులకు ఏదైనా వ్యాధి సోకినా చికిత్స, మందులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. బిల్లుల జాప్యంతో కొంత మంది పాల ఉత్పత్తిదారులు బయట ప్రైవేట్‌లో అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. మరోవైపు రుణాలతో గేదెలను కొనుగోలు చేసిన రైతులు బ్యాంకులకు ఈఎంఐలను చెల్లించలేకపోవడంతో కిస్తీలు కట్టాలని బ్యాంకర్లు రైతులపై ఒత్తిడి పెంచుతున్నారు.

### జూలై నుంచి పాల బిల్లులు రాలేదు



ఉదయం, సాయంత్రం కలిపి రోజుకు 100 లీటర్ల పాలను ఊళ్లో పాల సెంటర్‌లో పోస్తా. జూలై నుంచి బిల్లు రాలేదు. లక్షా 20 వేల రూపాయల బిల్లు విజయ డెయిరీ వాళ్ల నుంచి రావాల్సి ఉంది. పాలు సేల్ అవడం లేదు. పౌడర్ తయారు చేస్తున్నారట. పాల సేల్ పెరిగినప్పుడు వెంటనే బిల్లు ఇచ్చేది. అసలే పండుగల సీజన్. డబ్బు చాలా అవసరం ఉంది. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోతే ఎలా?

*- మేకల సునీత , శివారెడ్డిగూడెం గ్రామం, భూదాన్‌పోచంపల్లి మండలం*

# ఇండ్ల పట్టాల కోసం కలెక్టరేట్ ముట్టడి

- రెండు గంటల పాటు దిగ్బంధించిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

సూర్యాపేట, సెప్టెంబర్ 23 : పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ హెచ్చరించారు. ఇండ్ల పట్టాలు ఇప్పించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట రెండు గంటల పాటు ధర్నా దిగ్బంధించారు. చివ్వెంల మండలం కుడకుడలోని సర్వే నెంబర్ 126, నేరేడుచర్ల మున్సిపాలిటీలోని సర్వే నెంబర్ 243, 244లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాసీల్దార్లు పేదల గుడిసెలను తొలగించవద్దన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఆందోళనలో ఆ పార్టీ నాయకులు కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్, నర్సయ్య, నాగయ్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు, ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది ఉండొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 23: గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవటంతో పాటు పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స చేయించుకునేలా అవగాహన కల్పించాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కావాల్సిన మెడిసిన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకులాల్లో విజయ డెయిరీ పాలు వినియోగించేలా చూడాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో దోమల నివారణకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలని, తాగు నీరు కలుషితం కాకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారులకు సూచించారు. విద్యుత్ లైన్లు సరిగా లేని చోట వెంటనే సరి చేయాలని, రుణమాఫీ కాని వారి వివరాలను మూడు రోజుల్లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైద్యాధికారుల పోస్టులకు 26న ఇంటర్వ్యూలు

నీలగిరి, సెప్టెంబర్ 23 : నల్లగొండ జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం, ఈజేహెచ్ఎస్ ప్రొగ్రామ్‌లో పనిచేసేందుకు ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు, ఒక పిల్లల వైద్యనిపుణుడు అవసరం ఉన్నారని, ఆయా పోస్టుల భర్తీకి ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ సర్టిఫికెట్లు, అర్హత పత్రాలతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మెరిట్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 46 కేసుల్లో నిందితులు



కరెంట్ వైర్ దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

బొమ్మలరామారం, సెప్టెంబర్ 23 : కరెంట్ వైర్లు, ట్రాన్స్‌ఫారమ్‌లో కాపర్ వైర్ దొంగతనం చేస్తున్న బీహార్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠాను బొమ్మలరామారం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. భువనగిరిలో డీసీపీ రాజేశ్‌చంద్ర సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. బొమ్మలరామారం ఎస్ఐ శ్రీశైలం అధ్వర్యంలో పోలీసులు సోమవారం తెల్లవారుజామున చీకటిమామిడి చౌరస్తా వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా తుర్కపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనాలను అనుమానంతో సోదా చేశారు. వాటిల్లో కరెంట్ వైర్లు, కాపర్ తీగలు దొరికాయి. దీంతో బీహార్‌కు చెందిన 8మంది ముఠా సభ్యులను అరెస్టు చేసి విచారించగా దొంగతనాలు బయటపడ్డాయి. వారు 46 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి 2.73లక్షల నగదు, రెండు కార్లు, ఆటోట్రాలీ, 8సెల్‌ఫోన్లు, 200కిలోల కాపర్, అల్యూమినియం తీగలను స్వాధీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రం దర్భాంగా జిల్లా సన్‌కార్ గ్రామానికి చెందిన బిక్రమ్‌సింగ్ (33) హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ముఠాను ఏర్పాటు చేశాడు. బీహార్ రాష్ట్రం మధుబని జిల్లా మెటోటి గ్రామానికి చెందిన మహేందర్ రామ్ (30) వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. మేడ్చల్ రంగారెడ్డి జిల్లా జిడిమెట్ల గ్రామానికి చెందిన రామ్‌కుమార్‌సింగ్(24) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జార్ఖండ్ రాష్ట్రం గోడ్డా జిల్లా లకర్మర గ్రామానికి చెందిన గోవింద్ మండల్(25) హైదరాబాద్‌లో కూలి పని చేస్తున్నాడు. బీహార్ రాష్ట్రం చప్రా జిల్లా బజీయా గ్రామానికి చెందిన శ్రావణ్ మహతో (28) హైదరాబాద్‌లోని జీడిమెట్లలో కూలీగా పనిచేస్తున్నాడు. బీహార్ రాష్ట్రం కైమూర్ జిల్లా నివే గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్ మిశ్రా(24) కుత్బుల్లాపూర్‌లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బీహార్ రాష్ట్రంలోని ముజఫర్‌పూర్ జిల్లా చందన్‌బారీ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌రాయ్(30) జీడిమెట్లలో కూలీగా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లోని నారాయణగూడకు చెందిన అమిత్ (28). వీరంతా ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. వారిని అరెస్టు చేసి భువనగిరి కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించిన ఎస్ఐ శ్రీశైలం, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, రాజు, నాగార్జున, మెహబూబ్‌ను డీజీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.